క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడికి సత్కారం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నవోదయ కాలనీ సమీప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పదవులు అందుకున్న వారిని పలువురు కలిసి సత్కరించారు. ఆదివారం కార్యాలయానికి స్థానిక నాయకులు చేరుకుని పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పదవులు చేపట్టిన వారిని సత్కరించారు. అనంతరం వేణుగోపాల రెడ్డిని తాడేపల్లి పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, కార్యవర్గ సభ్యులు పేరసాని రామకృష్ణ, కునుకు రామకృష్ణ, షేక్ అన్వర్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, ఎస్వై నాయుడు, ఎస్.కె సలాం, పి.శ్రీనివాసరావు, బి.మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం మార్నింగ్ స్టార్ కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురం నుంచి గుంటూరు వెళుతున్న కారును ప్రమాదవశాత్తు గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళుతున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో ఇరువురినీ గుంటూరులోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దేవుని మహిమలు ఎనలేనివి



ఫిరంగిపురం: దేవుని మహిమలు ఎనలేనివని విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం ప్రత్యేక శ్రీసభ దివ్యపూజాబలి నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ ప్రతి ఒక్కరూ దేవునితో భక్తితో మెలగాలని, ప్రేమతత్వాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ఆత్మఫలాలైన ప్రేమ, ఆనందం, శాంతి, విశ్వసనీయత, నిగ్రహం, శాశ్వతరం, సహనం, మంచితనం ప్రతి ఒక్క విశ్వాసునిలో ఉండాలన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు.

తీరు మార్చుకోకుంటే పీడీ యాక్ట్ అమలు చేస్తాం

మంగళగిరి టౌన్: రౌడీషీటర్లు తమ తీరును మార్చుకోకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, రౌడీషీటర్లు నివసించే ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కొందరు రౌడీషీటర్లు తెలిసీ తెలియక చేసిన నేరాలతో రౌడీషీటర్లుగానే కొనసాగుతున్నారని, దీని వల్ల వారి కుటుంబ సభ్యులు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇప్పటికైనా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితుల దాడులపై గవర్నర్‌కి లేఖ



దుగ్గిరాల: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులపై దాడులు అధికంగా జరుగుతున్నాయని రాష్ట్ర గవర్నర్‌కి బహిరంగ లేఖను ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎమ్మార్పీఎస్ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ రాశారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో దళితులపై దాడులు జరుగుతున్నాయని వివరించి, బహిరంగ లేఖ పంపనున్నామని తెలిపారు. లేఖలో దళితులపై దాడులు అరికట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. 20 ఏప్రిల్ 2025లో పిఠాపురంలో జనసేన పార్టీ కి చెందిన శెట్టి బలిజ పెత్తందార్లు దళితులను సాంఘీక బహిష్కరణ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాదిగ, ఎస్సీ నాయకులు కట్టా అశోక్, కృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఎరువు.. సాగుకు మేలు!

- మొదలైన (దిబ్బ) ఎరువు తోలకాలు
- ట్రక్కు ఎరువు రూ.1200
- ఎరువుతో భూమి సారవంతం



పొలంలో పోసిన దిబ్బ ఎరువు

ఫిరంగిపురం: తొలకరికి ముందు రైతులు తమ పొలాలకు పశువుల (దిబ్బ) ఎరువు పొలాల్లో వేయిస్తుంటారు. కొద్ది రోజుల తరువాత భూమి దున్నే సమయంలో మరికొంత కోళ్ల ఎరువు, జీవాల ఎరువులు వేయడం ద్వారా భూమి సారవంతమవుతుందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రెండురోజులుగా పశువుల పేడతో వేసిన దిబ్బలను ట్రాక్టర్లద్వారా పొలాలకు తరలిస్తున్నారు. మండలంలోని 18 గ్రామాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు భూమిని సాగు చేస్తున్నారు. దానిలో పత్తి, మిర్చి పంటలతో పాటుగా వరి పంటను వేస్తున్నారు. మరో రెండు వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

రోగనిరోధక శక్తిగా పశువుల ఎరువు..

ప్రతి రైతు పంటను వేసే నెల రోజుల ముందు పశువుల ఎరువును ఎకరాకు నాలుగు ట్రక్కులు వేసి కలియ దున్నిస్తారు. దీని ద్వారా మట్టిలో పూర్తిగా పశువుల ఎరువు కుళ్లిపోయి కలిసిపోతుంది. దీంతో భూమిలో నీటి నిలుపుదల ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. అంతేకాక మొక్కలకు రోగనిరోధక శక్తిగా ఉండి ఎదుగుదల బాగుంటుంది. చీడపీడలు సోకకుండా ఉండడమే కాకుండా.. రసాయన ఎరువుల వాడకం 25 శాతం తగ్గుతుంది. దీంతో పంట దిగుబడి పెరగనుంది. వీటితో పాటు ఎకరా భూమికి క్వింటాన్నర వేపపిండి కలపడం ద్వారా వేరు పురుగులు నశిస్తాయంటున్నారు వ్యవసాయ అధికారులు. ఫలితంగా రసం పీల్చే పురుగుల నివారణ సాధ్యమవుతుంది.

ట్రక్కు ధర రూ.1200..

ఒక్కో రైతు తనకున్న పశువుల దిబ్బ పొలానికి తోలించుకోవడమే కాకుండా మరికొంత అవసరం మేరకు ట్రక్కుకు సుమారు రూ.1200 ధర చెల్లించి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో రసాయనిక ఎరువుల వాడకం ఎక్కువ మోతాదులో తగ్గుతుందని చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ యేడు ట్రక్కు ధర రూ.300 వరకు పెరిగిందన్నారు.

దిగుబడి బాగుంటుంది..



ఎకరానికి నాలుగు ట్రక్కులు దిబ్బ ఎరువు వేసి దున్నించడం ద్వారా భూమి గుల్లబారుతుంది. పంట దిగుబడి కూడా బాగుంటుంది. 10 ఎకరాల్లో పంట సాగుచేస్తున్నాను. మరి కొన్ని ట్రక్కులు రూ.1200 చొప్పున కొనుగోలు చేసి పంటకు వేస్తున్నాను. పంట సాగుకు పశువుల ఎరువు ఎంతో మేలు చేస్తోంది.

– కబ్బిరెడ్డి, రైతు, వేమవరం

20 ఎకరాల్లో సాగు..



ఏటా 20 ఎకరాల్లో పత్తి, మిరప పంటలు సాగు చేస్తున్నాను. ఇంటి పశువుల ద్వారా వచ్చిన ఎరువుతో పాటు మరికొన్ని ట్రక్కులు కొని పంటలకు తోలుతుంటాను. గతేడాదితో పోలిస్తే ఈ యేడు రూ.300 ఎరువు ధర పెరిగింది. ఈ పశువుల ఎరువు పంటలకు రోగనిరోధక శక్తిగా పనిచేస్తుంది.

– గోవర్ధన్‌రెడ్డి, రైతు, వేమవరం

పట్టణంలో విజిబుల్ పోలీసింగ్

మంగళగిరి టౌన్: విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలన్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం మంగళగిరి పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించినట్లు మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజల భద్రతకు భరోసా ఉంటుందన్నారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణీలకు ఆటోలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేశామని, విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ట్రిపుల్ రైడింగ్, వాహనాలకు సరైన నెంబర్ ప్లేట్లు, రికార్డులు లేకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారిని, లైసెన్స్ లేని వారిని గుర్తించి జరిమానా విధించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్‌లను సూచించేలా హెచ్చరికల బోర్డులు గమనించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్రనాయక్, సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, సుధీర్, వెంకటరావు, శివయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ కబంధ హస్తాల్లో మోడీ

తాడికొండ: అమెరికా అధ్యక్షులు ట్రంప్ కబంధ హస్తాల్లో ప్రధాని మోడీ చిక్కుకున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. పొన్నెకల్లు సీపీఐ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రధాని ట్రంప్ చేతిలో పడి దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని, దేశ సంపదను మోడీ అనుచరులైన కుబేరులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలను ఒక్కటైనా నేరవేర్చారా అంటూ నిలదీశారు. దేశం, రాష్ట్రంలో నానాటికీ నిరుద్యోగ సమస్య పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 9, 10, 11 తేదీల్లో చండీఘర్‌లో సీపీఐ జాతీయ మహాసభలు.. ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలు రాష్ట్ర సభలు, ఆగస్టు 23, 24 తేదీలలో గుంటూరు జిల్లా మహాసభలు జరుగుతాయనిఏ వెల్లడించారు. ఈనెల 21న అడ్డరోడ్డు పున్నమ్మ చెరువు విషయంలో తాడికొండ పంచాయతీలో విచారణ జరుగుతుందని, అన్ని పార్టీలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, వ్యకాస నాయకులు గుర్రంకొండ సత్యానందం, కంభంపాటి దేవునిదయ, రేపూడి శ్రీనివాసరావు, తోకల అనురాధ, రామినేని రామారావు, కోట భూపతిరావు, దామినేని పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి, మంగళగిరి టౌన్: ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఒంగోలులో జరిగే ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ (మెన్, ఉమెన్) ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు గుంటూరు జిల్లా తరుపున క్రీడాకారులను ఆదివారం మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్‌లో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధానిలు మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా వ్యాప్తంగా మహిళా పవర్ లిఫ్టర్స్ 15 మంది, మెన్ పవర్ లిఫ్టర్స్ 11 మంది కలిపి మొత్తం 26 మంది హాజరయ్యారని తెలిపారు. హాజరైన వారిలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ టీమ్‌లను ఎంపిక చేశామని అన్నారు. ఎంపికైన క్రీడాకారులను గుంటూరు జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్.ఎస్.వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు బి.ప్రసాద్, భాస్కరావు, బొలినేని చంద్రిక తదితరులు అభినందించారు.

మహంకాళీ అమ్మవారికి చండీ హోమం



దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజుకొండూరు గ్రామంలో కొలువైన శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. పూజాకార్యక్రమాల్లో భాగంగా అమ్మవారు శ్రీసరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హోమం క్రతువులో దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తుల ఏర్పాట్లను ఈవో కె.సునీల్ కుమార్ పరిశీలించారు.

పొలంలో వ్యక్తిపై దాడి

దుగ్గిరాల: మండలంలోని చెన్నకేశవ నగర్ సమీపంలోని పొలంలో పనిచేస్తున్న వ్యక్తిని గుర్తుతెలియని కొందరు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. స్థానికుడైన కె.చిట్టిబాబు ఆదివారం పని మీద పొలానికి వెళ్లారు. గుర్తుతెలియని కొందరు చిట్టిబాబు దగ్గరకు వచ్చి దాడి చేసి పరారయ్యారు. దాడిలో గాయపడిన అతన్ని స్థానికులు తెనాలి ప్రభుత్వ హాస్పటల్‌కి తరలించారు. ఘటనపై పోలీసులను వివరణ కోరగా కేసు పరిశీలిస్తున్నామని అన్నారు.

బడిబాట ప్రచారం

తెనాలి: ప్రభుత్వ ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య చేపట్టిన బడిబాట ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో 'దండోరా–మైక్ ' ప్రచారం చేశారు. నాడు–నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించారని, ఇటీవల టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ సంస్థలకు దీటుగా మెరుగైన ఫలితాలను సాధించారని వెంకయ్య గుర్తుచేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కి సంఘీభావంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ అనూరాధ తదితరులు

మంగళగిరి టౌన్: 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతం చేసిన సైనిక దళాలకు సంఘీభావంగా ఆదివారం మంగళగిరి నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి మెయిన్‌బజార్, గాం. దీచౌక్ వరకు జాతీయ పతాకాలతో తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై' అంటూ ప్రతి ఒక్కరు నినాదాలు చేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ.. ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం గర్వకారణమని అన్నారు. దేశ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగ్నమైన మన సైనికులకు సంఘీభావం తెలపాలన్నారు. సైన్యానికి ఎలాంటి నష్టం జరగకుండా చాకచక్యంతో పాక్ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఈ ఘనత నిస్సందేహంగా సైనికులదేనని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, కూటమి నాయకులు, విద్యార్థులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

పరమ పవిత్ర త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీత ప్రచారంలో పాల్గొన్న సభ్యులు

దుగ్గిరాల: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంధాలు, భగవద్గీత ప్రచారాన్ని మండలంలోని ఈమని గ్రామంలో ఆదివారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. కమిటీ అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీ కృష్ణుడిని, భగవద్గీతను విశ్వసించడంతో జ్ఞానం, మోక్షం లభిస్తాయని పేర్కొన్నారు. త్రైత సిద్ధాంతం జ్ఞానం తెలుసుకోవానే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామని అన్నారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజించి ఉన్నాడని.. అవి ఆత్మ, జీవాత్మ, పరమాత్మ లేనని.. వాటి గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతమని తెలిపారు. కార్యక్రమంలో టి.వి.కృష్ణా రావు, ఆర్.రామకృష్ణ, ఎ.అన్నపూర్ణ, ఎ.సాత్విక తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా పారిశుద్ధ్య పనులు

ఫిరంగి పురం మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మొక్కుబడిగా సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది మాత్రం విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇక గ్రామ శివారుల్లో చూస్తే భారీగా వ్యర్థాలు, ప్లాస్టిక్ సంబంధిత పదార్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

- గ్రామాల శివారుల్లో కుప్పలుగా వ్యర్థాలు
- నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- అధికారుల వైపు నుంచి కనీస పర్యవేక్షణ కరువు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఫిరంగిపురంలోని రైలు గేటు సమీపంలో కుప్పగా పడేసిన వ్యర్థాలు

ఫిరంగిపురం: ఫిరంగిపురం రైలు గేటు సమీపంలో ఉన్న కాలువ వద్ద చెత్త కుప్పలు కుప్పలుగా పడి ఉంది. వ్యాపారాలు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు తీసుకొచ్చి ఇక్కడ పడేస్తున్నారు. దీంతో మురుగునీరు పారుదలకు కూడా ఆటంకం ఏర్పడుతోంది. ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. రైల్వే గేటు పడినప్పుడల్లా వాహనదారులు అక్కడే ఎక్కువసేపు వేచి ఉండాల్సి రావడంతో నానా అవస్థలు పడుతున్నారు. అల్లంవారిపాలెం గ్రామ శివారు నుంచి సబ్‌స్టేషన్ వరకు దారిపొడవునా వ్యర్థాలు పడేసి ఉన్నాయి. ఫిరంగిపురం నుంచి రేపూడి గ్రామ శివారులో గొల్లపాలెం వెళ్లే దారి చెరువు వద్ద కూడా చెత్త పేరుకుపోయింది. నుదురుపాడు గ్రామ సమీపంలోని రాష్ట్ర రహదారిపై కొందరు సిబ్బందే చెత్తకుప్పలను తగలబెడుతున్నారు.

ప్రచారానికే పరిమితం

ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛతపై కార్యక్రమాలు నిర్వహించాలి. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలి. కానీ ఇవేమీ చేయకపోవడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. మొక్కుబడిగా గ్రామంలో కొద్దిసేపు ర్యాలీలు నిర్వహించడం మినహా చెత్త తొలగింపునకు చేసిందేమీ ఉండటం లేదని మండిపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సక్రమంగా చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు చేపట్టాలని పేర్కొంటున్నారు.

కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు

నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు



వజ్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

తాడికొండ: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు తప్పక ఉంటుందని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) అన్నారు. నూతనంగా పదవులకు ఎంపికైన తుళ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు, మండల కమిటీ సభ్యులు, గ్రామపార్టీ అధ్యక్షులు ఆదివారం గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి నాయకులు, కార్యకర్తలే పునాదులని.. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే 2029 ఎన్నికల్లో భారీ విజయం సుసాధ్యమని అన్నారు. పదవులను బాధ్యతగా తీసుకొని పనిచేయడం ద్వారా ప్రజలకు చేరువై అందరి మన్ననలు పొందవచ్చని, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగట్టి సామాన్యుడికి సంక్షేమం అందించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల సురేష్, వివిధ విభాగాల నాయకులు ఆలూరి శ్రీనివాసరావు, కంతేటి చిన్న వెంకటేశ్వర్లు చుండు వెంకటరెడ్డి, నాయుడు నాగేశ్వరరావు, కొప్పుల శేషగిరిరావు, గొట్టం వెంకట నర్సింహారెడ్డి, సుబ్బారావు, తూమ్మూరు వరప్రసాద్ రెడ్డి, ఆరేపల్లి జోజి, ఐనవోలు సుధీర్, బెజ్జం రాంబాబు, గద్దర్ చెన్నకేశవ, గుమ్మా శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై మంగళవారం జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం గ్రామంలో రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకరరావు మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించడం లేదని, మిర్చి, పొగాకు ధరలు లేక రైతులు విలవిలలాడుతున్నారని, పెసలు, మినుములు, శనగలకు గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రక్షించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంట కాలువలోకి మురుగు నీరు కలవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పంట కాలువలో మురుగును అరికట్టాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు, కౌలురైతులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 9.8 మి.మీ వర్షపాతం నమోదు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో శనివారం ఏకధాటిగా కురిసిన వర్షంతో ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీంతో మండలంలో 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యిందని వాతావరణ శాఖ అధికారులు ఆదివారం వివరాలను వెల్లడించారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో గోపూజ



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆగమ శాస్త్రం ప్రకారం గోపూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం ఆలపాటి భార్గవ సాయి దంపతులు స్వామి వారికి పంచామృత అభిషేకం జరిపించి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం పల్లకి ఉత్సవం, స్వామికి అష్టోత్తర సహస్ర నామార్చన జరిపి భక్త సమాజాల వారు హనుమాన్ చాలీసా పారాయణ, భజన కీర్తనలు అలపించారు.

వీర బ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠా మహోత్సవం

చుండూరు(వేమూరు): వీర బ్రహ్మేంద్ర స్వామి ఆశీస్సులు ప్రతి కుటుంబానికి ఉండాలని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామంలో ఆదివారం వీర బ్రహ్మేంద్రస్వామి పరివార దేవతా ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కుంచెల భగద్గీత, వెంకట రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రాఘురామి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామ కృష్ణా రెడ్డి, సీనియర్ న్యాయవాది దాట్ల మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.